ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి


సిద్దిపేట

5

శనివారం 10 మే 2025



మల్లన్న ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఈవో అన్నపూర్ణ





సిద్దిపేట పట్టణంలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా హిందూ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

‘సిందూర్’కు మద్దతుగా

సిద్దిపేట కల్చరల్/చేర్యాల/హుస్నాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా జిల్లాలో ర్యాలీలో, పూజలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో హిందూ జాగృతి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని చేపట్టారు. శివాజీ చౌక్ నుంచి గాంధీ చౌరస్తా, లాల్ కమాన్, శుభోదయ స్కూల్, అంబేడ్కర్ చౌక్ మీదుగా జాతీయ పతాకాన్ని రెపరెపలాడిస్తూ, పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. సైన్యానికి మద్దతుగా సిద్దిపేట మోహినిపురలోని వేంకటేశ్వరాలయం, పటేల్‌పురలోని సంతోషీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో వీరశైవార్చకులు శత్రుజయ పాశుపతహోమాన్ని నిర్వహించారు. పాక్ ముష్కరుల దాడిలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు నివాళిగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట, హుస్నాబాద్‌లో ర్యాలీని నిర్వహించారు. హుస్నాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో, సిద్దిపేటలో ముస్తాబాద్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.





సిద్దిపేటలో మురళీనాయక్‌కు నివాళి


ఎల్‌ఆర్‌ఎస్ స్పందన లెస్

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీ చెల్లింపునకు మరో అవకాశం కల్పించారు. అయినా, దరఖాస్తుదారుల నుంచి స్పందన అంతంత మాత్రమే. మొదటగా ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించగా అంతకుముందు కంటే కేవలం 8 శాతం అర్జులే రుసుం చెల్లించారు. మార్చిలో 12 శాతం చెల్లించగా మొత్తంగా ఇప్పటివరకు జిల్లాలో 20 శాతం మాత్రమే రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటివరకు రూ.30.84 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెలాఖరు వరకు రెండోసారి పొడిగించగా ఈ అవకాశాన్నైనా సద్వినియోగం చేసుకుని అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

- గడువు పొడిగించినా ముందుకు రాని దరఖాస్తుదారులు
- రాయితీ సద్వినియోగం చేసుకున్నది 20 శాతం
- గత నెలలో వినియోగించుకున్నది 8 శాతమే
- ఈ నెలాఖరు వరకు మరో అవకాశం
- ప్రొసీడింగ్ పంపిణీలో ఆలస్యం

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు

కేటగిరీ	దరఖాస్తులు	అనుమతి	చెల్లించింది	ఆదాయం
సుడా పరిధి	21,702	20,947	3,883	6.65 కోట్లు
జీపీలు	20,675	19,252	4,789	7.81 కోట్లు
సిద్దిపేట మున్సిపల్	33,188	27,965	5,045	8.48 కోట్లు
హుస్నాబాద్	6,063	5,641	1,256	2.60 కోట్లు
చేర్యాల	6,111	5285	867	1.30 కోట్లు
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	11,643	10,271	1,748	3.62 కోట్లు
దుబ్బాక	1,894	1,798	280	0.38 లక్షలు
మొత్తం	1,01,276	91,159	17,868	30.84 కోట్లు



ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తున్న దరఖాస్తుదారులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 9 : అనుమతి లేని లేఅవుట్లు, అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఇప్పటికే రెండుసార్లు గడువును పొడగించగా చాలా తక్కువ మంది దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించి క్రమబద్ధీకరణకు ముందుకు వస్తున్నారు. ఈ నెలాఖరు వరకు అవకాశం ఉండడంతో ఏమేర సద్వినియోగం చేసుకుంటారో చూడాలి.

91,159 దరఖాస్తులకు అర్హత

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, సుడా అథారిటీ పేరిట మూడు కేటగిరీలుగా దరఖాస్తులను అధికారులు విభజించారు. వీటిలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, 23 మండలాలకు సంబంధించి, సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద సిద్దిపేట, సిద్దిపేట అర్బన్, చిన్నకోడూర్, నంగునూర్, కొండపాక నుంచి ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 1,01,276 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించిన అధికారులు 91,159 దరఖాస్తులకు ఫీజు చెల్లించేందుకు అనుమతినిచ్చారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 31 వరకు చివరి తేదీ కావడంతో దరఖాస్తుదారులకు కింది స్థాయి సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. ఏదైనా అనుమానాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలి. అర్బన్ డెవలప్‌మెంట్‌తో పాటు గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో వేలాది సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

- ఆశిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మన్, సిద్దిపేట

ఇప్పటికే రెండుసార్లు పొడిగింపు

మొదటగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపునకు మార్చి 31 వరకు గడువును విధించగా, దరఖాస్తుదారుల నుంచి ఏమాత్రం స్పందన కనిపించలేదు. అప్పుడు దాదాపు 12 శాతం మాత్రమే రాయితీ ఫీజును చెల్లించారు. దీంతో ప్రభుత్వం విస్తృత ప్రచారం చేపట్టి, రాయితీ ఫీజును సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువును పొడిగించింది. అయినా, దరఖాస్తుదారుల నుంచి స్పందనేమీ పెద్దఎత్తున రాలేదు. మొత్తంగా దాదాపు 20 శాతం మాత్రమే వినియోగించుకున్నారు. 91,159 దరఖాస్తుల్లో మొత్తంగా 17,868 మంది ఫీజు చెల్లించారు. అందులోనూ 11,070 మంది (12 శాతం) గత నెల చెల్లించినవారే. గడువు పెంచగా చెల్లించిన వారు 6,798 మంది మాత్రమే. ఈసారి ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. ఇప్పటివరకు చెల్లింపుల ద్వారా రూ.30.84 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెల 31 వరకు తుది గడువుగా విధించింది. దీంతో అధికారులు దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తూ, అవగాహన సమావేశాలను నిర్వహిస్తూ

మిగతా 8వ పేజీలో

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ తప్పనిసరి

- 15 నుంచి చేయించుకోవాలి
- జిల్లా రవాణా శాఖ అధికారి పురుషోత్తమ్ క్రిష్టోఫర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గజ్వేల్, మే 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ తప్పనిసరి అని, ఈ నెల 15 నుంచి చేయించుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి పురుషోత్తమ్ క్రిష్టోఫర్ ‘ఆంధ్రజ్యోతి’ ఇంటర్వ్యూలో సూచించారు.

జిల్లాలో ఎన్ని స్కూల్ బస్సులు ఉన్నాయి?

జిల్లాలో సిద్దిపేట, దుబ్బాకలో 185 స్కూల్ బస్సులు, చేర్యాలలో 18, హుస్నాబాద్‌లో 40, గజ్వేల్‌లో 137 స్కూల్ బస్సులుండగా, మొత్తం 380 స్కూల్‌బస్సులు ఉన్నాయి. ఈనెల 15 నుంచి స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నాం.

ఫిట్‌నెస్ పరీక్షలకు నిబంధనలేంటి?

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షకు తప్పనిసరిగా నియమ, నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా బస్సుల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్, రేర్ రిఫ్లెక్టర్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్, స్టీల్ గ్రిల్స్, అమర్చుకోవాలి. బస్సులపై స్లోగన్స్‌ను రాసుకోవాలి. లేనిపక్షంలో ఫిట్‌నెస్ చేయబోం. అంతేకాకుండా పదిహేనేళ్లు దాటిన స్కూల్ బస్సులను అమ్ముకోవడం లేదా స్క్రాప్ చేసుకోవడం చేయాలి. లేదంటే ఒక సీటుకు రూ.1,120 చార్జి చేయడంతో పాటు స్క్రాప్ చేయడం లేదా సీజ్ చేయడం జరుగుతుంది. స్కూల్ బస్సులకు సంబంధించి త్రైమాసిక పన్నులను క్రమం తప్పకుండా చెల్లించాలి.

జిల్లాలో వాహనాలు ఎన్ని? గతేడాది ఆదాయం ఎంత?

జిల్లాలో మొత్తం 3,64,823 వాహనాలున్నాయి. అందులో ట్యాక్స్‌ప్లేట్ వాహనాలు 41,934, ఓన్ ప్లేట్ వాహనాలు 3,22,889 వాహనాలు. గతేడాది రూ.85 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. 80 ఓవర్ లోడ్ కేసులు కాగా, రూ.7,27,315 ఆదాయం వచ్చింది.

వాహనదారులకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

వాహనాదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలి. మద్యం సేవించి ఎట్టి పరిస్థితిలో నడపవద్దు. తప్పనిసరిగా అన్ని రకాల వాహన పత్రాలు, లైసెన్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలి. లేదంటే వాహనాలను సీజ్ చేస్తాం.

సుందరీకరణ ఎన్నాళ్లకో?

- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ.18 కోట్లు
- పనులు ప్రారంభించి నాలుగు నెలలు
- సమీపిస్తున్న వర్షాకాలం.. ఇంకా 40 శాతమే పూర్తి

8



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద కొనసాగుతున్న పనులు

సాధారణ ప్రసవాలను పెంచాలి

- కలెక్టర్ మనుచౌదరి



గజ్వేల్ పట్టణంలోని ఎంసీహెచ్‌లో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి వైద్యాధికారులకు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంసీహెచ్‌లోకి గైనకాలజీ, పిడియాట్రీషన్ సేవలను మార్చడంతో మరింతగా సేవలను అందించే అవకాశం లభించిందన్నారు. ఆసుపత్రిలో పలు సమస్యలను డీసీహెచ్‌ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వాసుత్రిలో నెలకు 350 నుంచి 400 డెలీవరీలు అవుతున్నాయని, వాటిలో సాధారణ డెలీవరీల సంఖ్యను పెంచేందుకు దోహదం చేయాలని సూచించారు. అందుకు ప్రసవం కోసం వచ్చే గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. బ్లడ్ బ్యాంకు, పేషంట్ అటెండర్స్ గది, టాయిలెట్‌లను త్వరగానే మంజూరీ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

అధైర్యపడొద్దు.. న్యాయం చేస్తాం

సిద్దిపేట రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : గృహాల లబ్ధిదారులు అధైర్యపడొద్దని.. అందరికీ న్యాయం చేస్తామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, మాచాపూర్, సీతారాంపల్లి గ్రామాల్లో పెండిగ్‌లో ఉన్న గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పుల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ గృహనిర్మాణం పూర్తయిన వాటికి పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు గన్నీ బ్యాగులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, రైతులు ఇబ్బందులు తలెత్తకుడా చూడాలన్నారు. లారీల సమస్యపై సివిల్ సప్లై డీఎం, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. పుల్లూరు గ్రామంలో మార్కెట్ నిర్వహణకు ప్రభుత్వ భూమి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తహసీల్దార్‌ను పంపించి స్థల పరిశీలన చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పీడీ దామోదర్‌రావు, తహసీల్దార్ వెంకటొరెడ్డి, ఎంపీడీవో మురళీధర్‌శర్మ, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం విజయనిర్మల, సిబ్బంది రవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట రూరల్ : పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పరిశ్రమలకు అనుకూలమైన భూములను గుర్తించాలి

జగదేవ్‌పూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు అనుకూలమైన భూములను గుర్తించాలని, వెంటనే మ్యాపును సిద్దం చేసి అందించాలని కలెక్టర్ మనుచౌదరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జగదేవ్‌పూర్ మండలం మునిగడప పరిధిలోని పలుగుగడ్డ మాందాపూర్ గ్రామ సమీపంలో గల సర్వే నంబర్ 445లో గల 412 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు అనుకూలమైన భూముల వివరాలను సేకరించి మ్యాప్ సిద్దం చేసిన అనంతరం టీజీఐఐసీకి వివరాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, డీసీహెచ్ అన్నపూర్ణ, తహసీల్దార్ నిర్మల, టీజీఐఐసీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న రైల్వేస్టేషన్‌కు ఆరున్నర ఎకరాలు

- భవిష్యత్తు అవసరాల కోసం
- భూ సేకరణకు అధికారుల సన్నాహాలు
- కొందరు రైతుల అంగీకారం.. మరికొందరు ససేమిరా

7

కవిత్వానికి సమాజమే పునాది

- మరసం ఆధ్వర్యంలో
- కవి అలాజీపూర్ కిషన్ పుస్తకాల ఆవిష్కరణ
- హాజరైన డాక్టర్ నందిని సిధారెడ్డి,
- దేశపతి శ్రీనివాస్

7

మెప్మాలో నిధుల పక్కదారిపై ప్రత్యేక కమిటీ

- జిల్లా ఆడిటర్ ఆధ్వర్యంలో విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మాలో నిధుల పక్కదారి అంశంపై శుక్రవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన ‘మెప్మాలో ఆగని అలజడి’ కథనంపై కలెక్టర్ మనూచౌదరి స్పందించారు. జిల్లా ఆడిటింగ్ అధికారి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సోమవారం నుంచి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జరిగిన నిధుల పక్కదారి అంశంపై విచారించనున్నారు. ఇప్పటికే మెప్మా పీడీ ఇచ్చిన నివేదిక మేరకు విచారణ జరిపి, సభ్యులను విచారించనున్నారు. ఈ కమిటీలో మెప్మా పీడీ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ ఉన్నట్లు తెలిసింది.

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

గజ్వేల్, మే 9 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మెప్మాలో జరిగిన అవినీతిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య, సీపీఎం సభ్యులు కానుగుల రమణాకర్, ఆయా గ్రూపుల సభ్యులతో కలిసి విన్నవించారు.

పోలీసు వ్యవస్థను కించపరిచడం సరికాదు

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి


చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో పోలీసు వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి ఎంతో మంది వ్యక్తుల వ్యక్తిగత సమాచారం సేకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు నేడు పోలీసు వ్యవస్థను కించపరిచేలా మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక బెల్టు షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో మద్యం ఏరులై పారింది కనిపించలేదా అని ప్రశ్నించారు. ఎంపీగా ఉన్న సమయంలో యువత ఉపాధి కోసం పరిశ్రమలు, విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని కోరాల్సింది పోయి పబ్బు కావాలని కోరిన వ్యక్తి నేడు ప్రభుత్వ విధానాల పట్ల ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేసి గెలిచిన ఎమ్మెల్యే నేడు అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎక్కడో ఒకచోట పోలీసులు లంచం తీసుకుని పట్టుబడితే మొత్తం పోలీసు వ్యవస్థనే అవినీతి మయం అయిందని దుబ్బాక ఎమ్మెల్యే మాట్లాడటం దారుణమన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడటం ఇకనైనా ఎమ్మెల్యే మానుకొని అభివృద్ధికి కలిసి రావాలని ఆయన హితవు పలికారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వృద్ధుడి మృతి


పోచయ్య (ఫైల్)

వర్గల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం గిర్మాపూర్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మెదక్ జిల్లా శివంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన దేవోల్లా పోచయ్య శుక్రవారం ఉదయం తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వర్గల్ మండలంలో శుభకార్యానికి వస్తున్నాడు. ఈ క్రమంలో వర్గల్ మండలం మాదారం గిర్మాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న రహదారి మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. దీంతో పోచయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు దేవోల్లా రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మాసాయిపేట, మే 9(ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం కొప్పులపల్లి వద్ద హల్దీ ప్రాజెక్టులో గురువారం రాత్రి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన చర్లపల్లి గ్రామం వర్ధమాన్ తాండాకు చెందిన కేతావత్ గోపాల్ నాయక్(32) కాలుజారి హల్దీ ప్రాజెక్టులో పడి గల్లంతయ్యాడు శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం నీటిలో తేలడంతో వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్దుర్తి ఎస్ఐ రాజు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. 19 మందిపై కేసు

కంగ్టి, మే 9(ఆంధ్రజ్యోతి): దంతాలను శుభ్రం చేసుకుంటూ రోడ్డుపై ఉమ్మి వేసిన విషయమై ఇరువర్గాల వారు ఘర్షణ పడడంతో మొత్తం 19 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 7న ఉదయం మండల పరిధిలోని నాగూర్.కె గ్రామానికి చెందిన బిరాదర్ సంతోష్ దంతాలను శుభ్రం చేసుకుంటూ రోడ్డుపై ఉమ్మి వేశాడు. ఇది చూసిన అదే గ్రామానికి చెందిన మహాదేవ్ ఇక్కడ ఎందుకు ఉమ్మివేశావని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది.. పెద్దలు జోక్యం చేసుకొని ఇరువురిని సముదాయించి పంపారు. కాని మహాదేవ్ తన అనుచరులైన ప్రభు, ధన్‌రాజ్, మల్‌శెట్టి, రవి, ప్రశాఅంత్, వీర్‌శెట్టి, గంగ్‌శెట్టి, శివనాథ్, శంకుపాటిల్, అశోక్‌లను పిలిపించి జగన్నాథ్ సంతోష్‌ల కుటుంబ సభ్యులపై కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుడు జగన్నాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేశారు. ఇదే ఘటనలో తమ నీటి నల్లా వద్ద ఎందుకు ఉమ్మి వేశావని అడిగినందుకు తమపై సంతోష్‌తో పాటు లక్ష్మి, తులసీరాం, అశోక్, శకుంతల, నిఖిల్‌లు దాడి చేశారని ప్రభు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో వర్గానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

23.3 కిలోల గంజాయి పట్టివేత

● నిందితుల అరెస్ట్, కారు స్వాధీనం


నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

సంగారెడ్డి క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం పలుచోట్ల మెరుపు దాడులు నిర్వహించి మొత్తం 23.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయిని తీసుకొని వచ్చి మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో విక్రయించే వ్యక్తిని సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన జలీలొద్దిన్ సిద్ధిఖి అహ్మద్‌హస్సేన్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతడు జీతం డబ్బులు సరిపోక గంజాయి క్రయ, విక్రయాలకు పాల్పడేవాడు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఇదే క్రమంలో శుక్రవారం 20 కిలోల గంజాయి సీలేరు నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తుండగా సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుందని, నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు కారు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నిందితుడికి గంజాయి విక్రయించిన లక్ష్మీబాయి, కృష్ణపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జైలుకెళ్లినా తీరు మారలే...

జలీలొద్దిన్ సిద్ధిఖీ అహ్మద్ హస్సేన్ 2023లో గంజాయి రవాణా చేస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా గంజాయి రవాణా, విక్రయాల అలవాటు మాత్రం మానుకోలేదు. తాజాగా శుక్రవారం సంగారెడ్డిలో ఎక్సైజ్ పోలీసులకు చిక్కి మరోసారి జైలు పాలయ్యాడు.

మూడు ఘటనల్లో..


పోలీసుల అదుపులో నిందితులు

అదేవిధంగా ఎస్ఆర్‌నగర్‌కు చెందిన సందీప్ నుంచి కిలోన్నర గంజాయి, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు వీణారెడ్డి, గాంధీ తెలిపారు. తెలిపారు. మరోకేసులో 615 గ్రాముల గంజాయి, బైక్, బీరంగూడకు చెందిన సాయికుమార్, శ్రీకాంత్‌ల నుంచి 12 కిలోల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

కిందపడి రికార్డ్ అసిస్టెంట్ మృతి

బెజ్జంకి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన వ్యక్తి కిందపడి మృతి చెందిన సంఘటన బెజ్జంకి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జంకికి చెందిన న్యాత మల్లేశం(50) కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మల్లేశం సుమారు ఆరు నెలల క్రితం నుంచి మద్యానికి బానిసయ్యాడు. నాలుగు రోజుల నుంచి మద్యం సేవించి ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆఫీసుకు వెళ్లిన మల్లేశం రాత్రి 8 గంటల వరకు ఇంటికి తిరిగి రాలేదు. మల్లేశం కోసం తన భార్య శ్యామల ఎదురు చూస్తుండగా ఇంటి సందులోకి వస్తు కిందపడి గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు అతనిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతుని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

మల్లన్న రైల్వేస్టేషన్‌కు ఆరున్నర ఎకరాలు

● భూ సేకరణకు అధికారుల సన్నాహాలు

● కొందరు రైతుల అంగీకారం.. మరికొందరు ససేమిరా

చేర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి శివారులోని మల్లన్న రైల్వే హాల్ట్‌స్టేషన్ భవిష్యత్ అవసరాల కోసం సుమారు ఆరున్నర ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పలువురు రైతులు భూములు అప్పగించడానికి అంగీకరించగా, మరికొందరు ససేమిరా అంటుండటం చర్చనీయాంశంగా మారింది. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ కొమురవెల్లి గ్రామశివారులో నుంచి నిర్మాణం జరిపారు. ప్రముఖ శైవక్షేత్రం మల్లన్న ఆలయం స్థానికంగా ఉండటం, యేటా లక్షలాది మంది తరలివస్తున్న నేపథ్యంలో రవాణా సౌకర్యం మెరుగుదల కోసం స్వామివారి పేరిట రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తూవచ్చారు. ఎన్నో ఒత్తిడులు, మరెన్నో వినతుల నడుమ అవాంతరాలు తొలగి సుమారు ఏడాదిన్నరక్రితం రైల్వే బోర్డ్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో హాల్ట్‌స్టేషన్‌కు అందుబాటులో ఉన్న ప్రభుత్వభూమిని కేటాయించారు. దీంతో ఒకేమార్గం గుండా ప్లాట్ ఫాం నిర్మాణం చేపట్టారు. ఇతరత్రా వెయిటింగ్‌హాల్, బుకింగ్ కౌంటర్ ఇతరత్రా పనులు తుదిదశకు చేరుకున్నాయి. కానీ హాల్ట్ కాకుండా అన్ని వసతులతో కూడిన రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దాలని కొంతకాలంగా డిమాండ్ కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో ప్లాట్ ఫాం విస్తరణ, ఇతరత్రా అవసరాలకు అవసరపడేలా సమీపంలోని భూములను సేకరించేందుకు నిర్ణయించారు. అందుకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 376లో 6.13 ఎకరాల భూమిని 23 మంది రైతుల నుంచి సేకరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎకరాకు రూ.14 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలుపుతూ ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత పరిహారానికి కొందరు రైతులు అంగీకరించగా, మరికొందరు పరిహారంపెంచి ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. త్వరలో ఇతరత్రా ప్రక్రియ పూర్తిచేపట్టి రైల్వేశాఖకు భూమిని స్వాధీనపరచనున్నారు. దీంతో రైల్వే వినియోగదారులకు మెరుగైన వసతుల కల్పనకు అవకాశం కలగనుండగా, పూర్తి స్థాయి స్టేషన్‌గా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



కొమురవెల్లి శివారులోని రైల్వేస్టేషన్

ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తాం..



రైల్వేస్టేషన్‌కోసం కొమురవెల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నం.376లో 6.13ఎకరాల భూమి సేకరణ కోసం ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించాం. పలువురు రైతులు అంగీకరించారు. మిగతావారు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఆయా అంశాల నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనానుసారం త్వరితగతిన సేకరణ ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటాం.

-జి. దివ్య, కొమురవెల్లి తహసీల్దారు



భూ రికార్డులను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి

పకడ్బందీగా ఆన్‌లైన్ నమోదు

● సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి

కొండాపూర్, మే9(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి స్వీకరించిన భూ సమస్యల వివరాల ఆన్‌లైన్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. తప్పిదాలకు తావులేకుండా డాటా ఎంట్రీ చేయాలని సంబంధిత ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం గొల్లపల్లిలో భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సును, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. భూసమస్యలను తెలుసుకొని, దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం భూ భారతి చట్టం అమలుకు చర్యలు తీసుకుంటుందన్నారు. చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం భూ సమస్యల పరిష్కారం ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదస్సులో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, తహసీల్దార్లు అశోక్, రవీందర్, డీటీ ప్రదీప్, ఆర్ఐలు రాజు, రాంచందర్ పాల్గొన్నారు.

● సంగారెడ్డి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : కంకోల్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు మధుకుమార్‌ను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రశంసించారు. కాళ్లు, చేతులు కోల్పోయినా ఆత్మవిశ్వాసంతో చదివి ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో 86 శాతం మార్కులు సాధించి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. ఈ మేరకు మధుకుమార్, అతని తల్లిదండ్రులను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె ఘనంగా సన్మానించారు.

ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రణాళిక

● కొండా లక్ష్మణ్ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి



సమావేశంలో యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి, తదితరులు

ములుగు, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యాన పంటల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కొండా లక్ష్మణ్ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగు శివారులోని యూనివర్సిటీ పరిపాలన భవనంలో ఉపకులాపతి డాక్టర్ దండా రాజిరెడ్డి అధ్యక్షతన విద్యాలయ అధికారుల సమక్షంలో ఉద్యానవన రంగ కీలక భాగస్వాములైన రైతులు, ఉత్పత్తిదారుల సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, ఎఫ్‌పీఓ నాయకులు, వ్యాపార సంస్థలు, ఎగుమతి దారులు, ఇన్‌పుట్ సరఫార దారులు పరిశోధన నిపుణులతో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఉద్యానవన పంటల సాగు యొక్క స్థిరమైన అభివృద్ధి కోసం, ఉద్యానవన రంగంలో వేగవంతమైన వృద్ధిని సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ దృక్పథ ప్రణాళికపై ముఖాముఖీ చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుత సవాళ్లను పరిష్కరించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. స్థితిస్థాపక పంట ప్రణాళికను సులభతరం చేయడంలో యూనివర్సిటీ నిబద్ధతను కొనియాడారు. వ్యవసాయం కోసం మార్కెట్‌లతో అనుసంధానించడంలో డిజిటల్ ప్లాట్‌ఫాం పాత్ర తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన సమగ్ర అభివృద్ధి కోసం తమ నాలెడ్జ్ హబ్, ఇన్నోవేషన్ మార్గదర్శకుడిగా తన పాత్ర పోషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్టర్ డాక్టర్ భగవాన్, ముల్కనూర్ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, అప్పారావు, వివిధ అంశాల బాధ్యులు, డాక్టర్‌లు చీనానాయక్, లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్, రాజశేఖర్, వీణజోషి, సతీష్ పాల్గొన్నారు.

మెదక్‌ను నంబర్ వన్‌గా నిలపాలి

● ఉల్లాస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/మెదక్ కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): విద్యాపరంగా జిల్లాను రాష్ట్ర స్థాయిలో నంబర్ వన్‌గా నిలపాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎంఈవో, హెచ్‌ఎంలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవో, హెచ్‌ఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ విద్యా ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపర్చిందన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తూ... 15 ఏళ్ల నిండిన నిరక్షరాస్యత గుర్తించి వారికి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిదేనన్నారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, డీఎస్‌వో రాజిరెడ్డి, ఏఎస్‌వో నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ పురోగతిపై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ తక్కువ బరువు పిల్లలను గుర్తించి వారు జులైలోపు పోషకాహార లోపాన్ని అధిగమించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భిణులు అన్ని రకాల పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో శిశు మరణాలు లేకుండా చూసుకోవాలని, అక్రమ దత్తతలను నిర్మూలించాలన్నారు. ఇక నుంచి ప్రతి నెలా రివ్యూ తీసుకోవడం జరుగుతుందని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, అంగన్వాడి సూపర్వైజర్స్, టీచర్లు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



చండూరు రెవెన్యు సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను తీర్చడానికే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని గ్రామాలలో ఎలాంటి భూ సమస్యలు ఉండకుండా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం చండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా పలువురు రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. వారి సమస్యలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పట్టా పాసుపుస్తకాలలో తప్పులు ఉన్న, రిజిస్ట్రేషన్లలో పేర్లు తప్పుగా వచ్చినా, సాదాబైనామా ద్వారా భూమి కొనుగోలు తదితర భూ సమస్యలకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు గ్రామస్థుల సమక్షంలోనే విచారించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్, డీటీ సింధుజా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చలాన్ల టార్గెట్

● దాడులకు దారితీస్తున్న తనిఖీలు

● రక్షక భటులకే రక్షణ కరువు

● వాహనదారులకు భారంగా జరిమానాలు

రామాయంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు చలాన్ల టార్గెట్లు నరకం చూపుతున్నాయి. తమ విధుల్లో సింహాల్లా విరుచుకుపడాల్సిన ఖాకీలకే రక్షణ కొరవడింది. నిత్య తనిఖీలతో జనాల్లో చులకనవుతున్నారు. మెదక్ జిల్లాలోని 21 పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ ఆదాయమే లక్ష్యంగా వాహనదారులపై విచ్చలవిడిగా జరిమానాలు వేస్తున్నారు. దీంతో ఇటీవల పలురు బైకర్లు పోలీసులనే ఢీ కొట్టి గాయపరచడం.. వారిపై తాగినమత్తులో దాడులకు తెగబడటం సర్వ సాధారణమైంది. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అవ్వడంతో పోలీసు శాఖ నిర్వీర్యం అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పోలీస్ స్టేషన్ పరిధిలో రోజువారీగా సుమారుగా 20 దాకా అంటే.. జిల్లా వారీగా నిత్యం 300 నుంచి 400 వాహనాలకు వివిధ కారణాలతో ఆన్‌లైన్ జరిమానాలు విధిస్తున్నారు. దీంతో నిత్యం లక్ష రూపాయల దాకా ఆదాయం వచ్చి పడుతోంది. తాగి నడపడం, రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసిన వారే దీనిలో అత్యధిక బాధితులని చెప్పవచ్చు. ఓ ప్రక్క జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, అన్ని మండల కేంద్రాల్లోనూ ఇరుకు రోడ్లే ఉండటంతో ప్రజలు షాపింగ్ చేయడం వారికి శాపంలా మారింది. ఇక్కడ వాహనాలు నిలిపితే గుట్టుచప్పుడు కాకుండా తమ ట్యాబ్‌లలో ఫోటోలు తీసి నేరుగా మెసేజ్ రూపంలో సదరు వాహనదారుడికి జరిమానా పంపుతున్నారు. ఇక జాతీయ రహదారులపై వేగం పెరిగితే రూ.900 దాకా ఫైన్లు వేస్తుండడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. అదేగాక వైన్స్‌లకు అతి చేరువలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం ద్వారా మద్యం ప్రియులు సులువుగా పోలీసులకు చిక్కి కోర్టుల దాకా వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలతో విసిగి, బేజారిన బాధితులు పోలీసు తనిఖీల్లో గొడవలకు దిగుతున్నారు.

ఇలాంటి ఘటనే వారం క్రితం జిల్లాలోని శివ్వంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మద్యం తాగి వెళ్తుండగా తనిఖీలు చేసేందుకు ఆపడంతో ఏఎస్‌ఐ శ్రీనివాస్ పై దాడికి తెగబడ్డారు. అలాగే రామాయంపేట పట్టణ శివారులో మోపెడ్ వాహనాన్ని నిలపమన్నందువు ఏకంగా పోలీసునే ఢీ కొట్టి గాయపరిచిన సంఘటన ఎనిమిది మాసాల కిందట చోటు చేసుకుంది. ఇలాంటివి పలుచోట్ల పునరావృతమవుతూనే ఉన్నాయి. తప్పు చేసిన వారు పోలీసులు అంటేనే భయంతో వణికి పోవాల్సి ఉన్నా ఫ్రెండ్లీ పోలీస్ విధానం లాంటివి ఖాకీలకు అడ్డొస్తున్నాయి. ఇకనైనా పోలీసు శాఖలో మార్పులు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రజా భద్రత గాలిలో దీపం..

పోలీసులు ఎంతసేపు జరిమానాలను విధించడంలోనే నిమగ్నమవుతున్నారే తప్ప వాహనదారుల ఇబ్బందులను ఎంత మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రహదారులపై నిత్యకృత్యంగా మారిన ట్రాఫిక్ సమస్య తీర్చడంలో వారి సమయమే లేకుండా పోతుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. రోడ్డెక్కితే వాహనాలకు చలాన్లు వేసే విధులు తప్ప.. రోడ్లపై జనం ఎదుర్కొంటున్న ఇబ్బందులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పోలీసు భద్రత గాల్లో దీపమేనంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. తప్పు చేసిన వారిని దండించాల్సిన పోలీసులు రోజంతా చలాన్లపైనే దృష్టి సారిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

స్వయం ప్రతిపత్తి.. ఐఎస్‌వో గుర్తింపు

● సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఘనత

● దోస్త్ ద్వారా అడ్మిషన్లు.. వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : న్యాక్ ఏ+గ్రేడు కలిగి ఉండి, ఐఎస్‌వో గుర్తింపు పొంది స్వయం ప్రతిపత్తి కలిగిన ఏకైక కళాశాల సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత అన్నారు. దోస్త్ ద్వారా అడ్మిషన్ల నేపథ్యంలో ఈ కళాశాల ప్రాముఖ్యతను, వివిధ కోర్సులను, వనరులను తెలియజేసేవిధంగా రూపొందించిన వాల్ పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1956లో ప్రారంభమై ఎంతోమంది విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. అన్ని వసతులతో కూడిన ల్యాబ్స్, పీహెచ్‌డీ, నెట్, సెట్ పూర్తిచేసిన అనుభవముగల అధ్యాపకులచే విద్యా బోధన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మొదటి ప్రాధాన్యతగా ఈ కళాశాలను ఎంచుకోవాలని కోరారు. అడ్మిషన్ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కళాశాలలోని దోస్తు జిల్లా సహాయ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, డా గోపాల సుదర్శనం, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి, వి. గురుమూర్తి దోస్తు టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం



కొలువైన స్వామివారు

వర్గల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 10 నుంచి 20 ఉత్సవాలు జరగనుండగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రతీ రోజు ఆలయంలో భగవద్గీత పారాయణం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ఆరాధన, గోష్ఠి, ప్రధాన యాగ శాల యందు దశ హవనములు, మూల మంత్ర హోమములు, ఉత్సవ మూర్తులకు తిరుమంజనం, మశిహరణ, నివేదన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంతం మురళీధర చార్యులు తెలిపారు. ఆలయ నిర్వాహకులు ప్రొద్దటూరి రాజులుగుప్త, టేకులపల్లి రాంరెడ్డి నేతృత్వంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

డీఎస్‌జేవో దశరథంకు పదోన్నతి

● నిజామాబాద్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ

సంగారెడ్డి అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జైళ్ల శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ హోదాలో డిస్ట్రిక్ట్ సబ్ జైల్స్ ఆఫీసర్(మెదక్-డీఎస్‌జేవో)గా విధులు నిర్వహిస్తున్న సి.హెచ్.దశరథంకు పదోన్నతి లభించింది. నిజామాబాద్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఆయనను పదోన్నతిపై బదిలీ చేస్తూ జైళ్ల శాఖ డీజీ డా.సౌమ్యమిశ్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్నే సిద్దిపేట జిల్లా జైలుకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. దశరథం పదోన్నతిపై నిజామాబాద్‌కు బదిలీ వెళ్లనున్న నేపథ్యంలో మెదక్ డీఎస్‌జేవోతో పాటు సిద్దిపేట జిల్లా జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలను సంగారెడ్డి(కంది)సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ డి.భరత్‌కు అదనంగా అప్పగించారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పుల్‌కల్, మే 9 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లో వెలసిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు స్థానిక గౌడ సంఘం అధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగున్నాయి. 12వ తేదీన గంగకు పోవుట, తెప్పోత్సవం, పూజ కార్యక్రమాలు, 13న రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని మహర్షి కల్యాణోత్సవం, బోనాల ఊరేగింపు అనంతరం అన్నదాన వితరణ నిర్వహించనున్నారు.

రేపటి నుంచి మల్లికార్జున స్వామి జాతర

అల్లాదుర్గం. మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిపెద్దాపూర్ శ్రీమల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల 11న స్వామి వారికి, ఎల్లమ్మ దేవతకు బోనాలు, 12న ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కవిత్వానికి సమాజమే పునాది

● 'మరసం' ఆధ్వర్యంలో కవి అలాజీపూర్ కిషన్ పుస్తకాల ఆవిష్కరణ ● హాజరైన డాక్టర్ నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్



అలాజీపూర్ కిషన్ రాసిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

సిద్దిపేట కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : కవిత్వానికి సమాజమే పునాది అని రచయిత, సామాజిక విశ్లేషకులు ఎస్.వేణుగోపాల్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవి అలాజీపూర్ కిషన్ రాసిన పుస్తకాలు, పేగు తెగిన పాట, వడిసెల ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాలను ఆవిష్కరించారు. మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె. రంగాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ కవిత్వానికి సామాజిక నేపథ్యమే పునాదిగా రచనలు చేస్తే ఆ రచన సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అన్నారు. వ్యక్తిగతమైన సాహిత్యం ఎక్కువ కాలం నిలబడేది కాదని అన్నారు. వ్యక్తిగతమైన అంశాల ప్రాతిపదికన రాసిన కవిత్వానికి కూడా సమాజమే ప్రధాన వస్తువుగా ఉంటుందని అన్నారు. ప్రఖ్యాత కవి రచయిత తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ కిషన్ తన రెండు కవితా సంపుటిల ద్వారా ఎంత గొప్ప కవిత్వాన్ని రాశాడో అంతే గొప్పగా ఒక సాహిత్య కార్యకర్తగా కూడా పనిచేశాడని అన్నారు. మంజీరా రచయితల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ప్రారంభమై తెలుగు నేలపై గొప్ప సాహిత్య సంస్థగా ఎదగడంలో కిషన్ నిర్వహించిన పాత్ర గొప్పదన్నారు. శాసనమండలి సభ్యులు, ప్రముఖ కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తనను సాహిత్యం వైపు నడిపించిన వాళ్లలో ప్రథముడు కిషన్ అని అన్నారు. సాహిత్యంలో తనకు ఓనమాలు దిద్దించాడని చెప్పారు. టీఎస్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్ మాట్లాడుతూ మంజీరా రచయితల సంఘం గత 40 ఏళ్లుగా సాహిత్య రంగానికి చేసిన కృషి అనిర్వచనీయమైనదని అన్నారు. సమాజంలో జరిగిన అనేక పరిణామాలలో మంజీరా రచయితల సంఘం ఉందని, మంజీరా కవులు ఒక సామాజిక బాధ్యతగా తమ కవిత్వాన్ని వెలువరిస్తూ ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు.

కిషన్‌కు వేముగంటి సాహితీ పురస్కారం

సిద్దిపేటకు చెందిన ప్రముఖ వచన కవి అలాజీపూర్ కిషన్‌కు వేముగంటి సాహితీ పురస్కారాన్ని అందజేశారు. గత 35 ఏండ్లుగా సామాజిక దృక్పథంతో కవిత్వం రాస్తున్న అలాజ్ పూర్ కిషన్ వడిసెలు, పేగుతెగిన పాట కవితా సంపుటాలను వెలువరించారు. ప్రజల పక్షాన నిలబడి సాహిత్య సృజన చేస్తున్న అలాజ్ పూర్ కిషన్‌కు వేముగంటి నరసింహాచార్యుల పేరిట ఏర్పాటుచేసిన సాహిత్య పురస్కారానికి వేముగంటి సాహిత్య పీఠం ఎంపిక చేసింది. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సాహిత్య సభలో అలాజ్ పూర్ కిషన్‌కు వేముగంటి సాహితీ పురస్కారాన్ని పలువురు ప్రముఖ రచయితలు అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

సిద్దిపేట క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి జైలు శిక్ష ఖరారైంది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలసి కొన్ని రోజుల క్రితం నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 14 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని శుక్రవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరు పరచగా విచారణ చేసి 14 మందికి కలసి రూ.21,500 జరిమానా వారిలో ఒక వ్యక్తికి 14 రోజులు, మరొక వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించారు.

అంగడిలో ఇష్టారాజ్యంగా వసూళ్లు

● బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఆరోపణ

హుస్నాబాద్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం జరిగే హుస్నాబాద్ అంగడిలో కాంట్రాక్టర్ రైతుల నుంచి ఇష్టారాజ్యాంగా డబ్బులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ అంగడిలో రైతులు, చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈసారి కాంట్రాక్టర్ తక్కువ ఆదాయానికి అంగడిని దక్కించుకున్నప్పటికీ రైతులు, చిరువ్యాపారుల వద్ద మాత్రం ఎక్కువగా వసూలు చేస్తున్నారని, దీనికి మున్సిపల్ కమిషనర్ కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. అంగడిలో కనీస సౌకర్యాలు కల్పించడానికి మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అంగడి కాంట్రాక్టర్ అక్రమ వసూళ్ళపై చర్యలు తీసుకోవాలని లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆలయానికి గ్రానైట్‌ని అందజేసిన హరీశ్‌రావు



చౌడాలమ్మ ఆలయానికి గ్రానైట్ పంపించిన హరీశ్ రావు

సిద్దిపేట అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో నిర్మించిన చౌడాలమ్మ ఆలయానికి సుమారు లక్ష రూపాయల విలువ చేసే గ్రానైట్‌ను మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు శుక్రవారం గ్రామ పార్టీ నాయకులతో ఆలయ కమిటీకి పంపించారు. లక్ష రూపాయల విలువ గ్రానైట్‌ను అందించిన హరీశ్‌రావుకి గ్రామ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు యాదగిరి, తాజా మాజీ సర్పంచ్ రేణుక శ్రీనివాస్, నాయకులు సంపత్ గ్రానైట్‌కు సంబంధించిన డబ్బులను అందజేశారు.

ఇళ్లకు వెళ్లకుండా కంచె ఏర్పాటు

● మిరుదొడ్డిలో బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

మిరుదొడ్డి, మే9 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు భూములకు రెక్కలురావడంతో కబ్జాచేసేందుకు అక్రమార్కులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అదేస్థాయిలో పుట్టుకొస్తున్నారని శుక్రవారం మిరుదొడ్డిలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ..గ్రామంలోని 30 ఏళ్ల క్రితం 758 సర్వేనంబరులో ప్లాట్లను కొనుగోలు చేయడంతోపాటు ఇళ్లను నిర్మించడం జరిగింది. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ప్లాట్లలోకి, ఇండ్లలోకి వెళ్లకుండా దారిలో కంచె వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేవిషయంపై జిల్లా కలెక్టరుకు, పోలీసులకు పిర్యాదు చేస్తామని తెలిపారు. అధికారులు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శంకర్

మిరుదొడ్డి, మే9 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అకాలవర్షంతో నష్టపోయిన రైతులకు ఏకరాకు 40వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఇదేవిషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికికూడా తీసుకువెళ్లామని తెలిపారు.

సుందరీకరణ ఎన్నాళ్లకో?

● ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ. 18 కోట్లు

● పనులు ప్రారంభించి నాలుగు నెలలు

● సమీపిస్తున్న వర్షాకాలం.. ఇంకా 40 శాతమే పూర్తి



ఎల్లమ్మ చెరువులో చేపట్టిన గ్లాస్ బ్రిడ్జి పనులు

హుస్నాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచనట్లయితే వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడతాయి. ఈ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 18 కోట్ల నిధులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంజూరు చేయించి జనవరి 5వ తేదీన పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా అనుకున్న మేర పనులు జరగడం లేదనే విమర్శలున్నాయి. దాదాపు 30 శాతం పనులు కూడా జరుగక పోవడంతో మరో నెల రోజుల్లో వర్షాకాలం సమీపించనుండటంతో పనులకు అడ్డంకిగా మారే అవకాశాలుంటాయి.



కొనసాగుతున్న సుందరీకరణ పనులు

ముఖ్యంగా చెరువులోకి నీరు చేరకముందే అందులో చేసే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా

దాదాపు 2వేల ఎకరాల ఆయకట్టు కలిగిన కాకతీయుల కాలంలో నిర్మించిన ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులు చేస్తున్నారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దీనిని మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు రూ.6 కోట్లు మంజూరు చేశారు. అయితే ఆ పనులు అనుకున్న మేర జరుగలేదు. తదనంతరం టూరిజం శాఖ రూ. 2.50 కోట్లు మంజూరు చేయగా వాకింగ్ ట్రాక్, లైటింగ్, కట్ట ఆధునీకరణ వంటి పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేశారు. ప్రస్తుతం ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో పాటు పర్యాటక కేంద్రంగా మార్చేందుకు రూ. 18 కోట్లు కేటాయించారు. చెరువు బ్యూటీషియన్‌లో భాగంగా ఎంట్రీ అర్చి, చెరువు కట్టకు గ్రాస్, వ్యూ డెక్, మామెంటర్ అర్చ్, గ్లాస్ బ్రిడ్జి, ప్లే ఏరియా, అర్నమెంటల్ వర్క్స్ వంటి పనులతో పర్యాటకంగా తీర్చిదిద్దబోతున్నారు. అయితే ఈ పనులు ఈ డిసెంబర్ లోగా పూర్తి చేయాల్సి ఉండగా ప్రస్తుతం 30 శాతం పనులు జరుగలేదు. చెరువు కట్ట లోపలి భాగం వైపు రాళ్లతో తెట్టె నిర్మాణం చేశారు. ప్రస్తుతం కాపర్ డ్యాం, ఎంట్రీ అర్చ్‌తో పాటు ఇతర పనులు జరుగుతున్నాయి. చెరువులోకి నీరు రాక ముందే గ్లాస్ బ్రిడ్జి పనులు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఈ పనుల పట్ల సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేదు. ఇప్పటికైనా పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

చెట్లు పెరిగినా బిల్లులు రాలే

● మూడేళ్లుగా నిలిచిన బిల్లులు

● ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్

గజ్వేల్, మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవానికి సిద్ధమవగా, మొక్కలను నాటి ఏర్పాట్లు చేయాలని అప్పటి జిల్లా అటవీ అధికారి ప్రత్యేకంగా శివరాములు అనే వ్యక్తిని కోరారు. శివరాములు అప్పులు చేసి, హడావిడిగా ఆదరాబాదరాగా పనులు చేయించారు. పనులు చేసిన శివరాములు మూడు నెలల పాటు నీటిని అందించి మొక్కలను పెంచాడు. అవి ఏడు, ఎనిమిది పీట్ల ఎత్తుకు పెరిగినా పనులు చేసిన శివరాములుకు మాత్రం ఇప్పటి వరకు పనులు చేసిన డబ్బులు రూ. 2 లక్షలకు సంబంధించిన డబ్బులు మాత్రం ఇవ్వలేదు. అక్కడా.. ఇక్కడా అప్పులు చేసి తెచ్చి ఇచ్చిన తనను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, పనులు చేయమని చెప్పిన అధికారి బదిలీపై వెళ్లారని, కొత్తగా వచ్చిన అధికారులు బిల్లులు ఇవ్వడం లేదని శివరాములు వాపోతున్నాడు. అటవీ శాఖ అధికారులు కరుణించి బిల్లులు విడుదల చేయాలని శివరాములు కోరుతున్నాడు

అర్హులకే అందిస్తాం: ఎంపీడీవో

మిరుదొడ్డి, మే9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించనున్న రాజీవ్‌యువ వికాసం పథకాన్ని అర్హులకు అందేవిధంగా చూస్తామని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో వివిధ బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందించే పథకాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హులకు మాత్రమే అందిస్తామని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● దరఖాస్తులను పరిశీలించిన అగ్రవాల్

● అధికారులకు ఆదేశాలు

కొండపాక, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. కొండపాక మండలం జప్తి నాచారం గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. అలాగే వెలికట్టలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కొండపాక ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాస దరఖాస్తులను పరిశీలించారు ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులతో ముచ్చటించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో కరెంటు సదుపాయం లేకపోవడాన్ని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా వెంటనే ఐకేపీ సిబ్బందికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఐకేపీ అధికారుల రిజిస్టర్‌లను పరిశీలించి ఆన్లైన్ విధానాన్ని వడ్లు విక్రయించే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడాన్ని పరిశీలించారు. వెలికట్ట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే లబ్ధిదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం కోసం వచ్చిన దరఖాస్తుల వివరములను పరిశీలించి అందుకోసం తీసుకోవాల్సిన చర్యలను ఎంపీడీవో, ఎంపీఓలకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్ దిలీప్ నాయక్ , ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపి ఓ మల్లిఖార్జున్, ఐకెపీ ఎంపీఎం ముగ్దం అలీ, పంచాయతీ కార్యదర్శి రాణి తదితరులున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

ఆరుతడి పంటలను వేసి అధిక లాభాలను పొందాలి

● ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడి

మిరుదొడ్డి, మే9 (ఆంధ్రజ్యోతి): రైతులు ఖచ్చితంగా వ్యవసాయాధికారుల సూచలను పాటించి, అనువైన పంటలను వేసి అధిక లాభాలను పొందాలని ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, శాస్త్రవేత్త రమాదేవి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన సాగుపద్ధతులపై రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఇష్టం వచ్చినట్లుగా రసాయానాలను, యూరియాను వాడకూడదని తెలిపారు. రైతులు అంతరపంటలను, ఆయిల్‌ఫాం పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఓ మల్లేశం, హెచ్ఓ రమేష్, ఏఈఓలు తదితరులున్నారు.

దిశ కమిటీ సభ్యుడిగా రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి

రాయపోల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా దిశ కమిటీ సభ్యుడిగా రాయపోల్ గ్రామానికి చెందిన బాగన్నగారి రవీందర్‌రెడ్డి నియామకమయ్యారు. జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వం పథకాల అమలు, పర్యవేక్షణ, సమన్వయం లక్ష్యంగా రూపొందించిన దిశ కమిటీ (జిల్లా అభివృద్ధి సమన్వయం మరియు పర్యవేక్షణ కమిటీ) పనిచేస్తుంది. తనను దిశ కమిటీ సభ్యునిగా నామినేట్ చేసిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

మహిళ రక్షణే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొబేషనరీ ఎస్సై సౌజన్య

నంగునూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కొత్త చట్టాలు తీసుకువచ్చిందని రాజగోపాలపేట ప్రొబేషనరీ ఎస్సై సౌజన్య అన్నారు.శుక్రవారం నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు మౌనం వీడి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మొద్దని తెలిపారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అమాయక ప్రజలను చూసి ఇది ఇస్తాము అది ఇస్తాము కొన్ని డబ్బులు పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయి అని మోసం చేసేవారు ఉంటారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రజలకు, మహిళలకు రక్షణగా ఉన్న చట్టాల పై షీటీం నిర్వహిస్తున్న విధులు, ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల పై క్లుప్తంగా వివరించారు. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రత కోసం పోలీసులు ఎప్పుడు అందుబాటులోనే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమములో సిద్దిపేట షీటీం బృందం తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంతో విద్యార్థుల్లో సృజనాత్మకత

సిద్దిపేట రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వేసవి శిబిరంతో సృజనాత్మక పెంపొందుతుందని సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాద్యులు స్వామి అన్నారు. శుక్రవారం పాఠశాలలలో 15 రోజుల పాటు జరిగిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు వివిధ అంశాలను నేర్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్ డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి




కేంద్రంలో ప్రజలు

గజ్వేల్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో గల గజ్వేల్ సబ్‌పోస్ట్ ఆఫీసులో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని మెదక్ డివిజన్ పోస్టల్ ఎస్పీ డి. శ్రీహరి తెలిపారు. కొత్తగా ఆధార్‌కార్డు నమోదు, నవీకరణ కొరకు ఆధార్ కార్డులో ఏవైనా మార్పులు, చేర్పులు, ఫోటో ఐడెంటిటీ, బయోమెట్రిక్ అప్డేట్ కోసం గజ్వేల్ సబ్ పోస్ట్ ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ఆధార్ సేవలను సులభంగా పొందవచ్చని పోస్టల్ ఎస్పీ పేర్కొన్నారు. పని దినములలో ఆధార్ నమోదు, నవీకరణ సేవలను ప్రజలు పొందవచ్చని చెప్పారు.

రేపు సిద్దిపేటలో పాలీసెట్ మోడల్ పరీక్ష

సిద్దిపేట క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేటలోని రామయ్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో పాలీసెట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు అకాడమీ నిర్వాహకుడు గందె బాలరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ప్రభుత్వం నిర్వహించే పాలీసెట్ పరీక్షను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల్లో భయాన్ని తొలగించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మోడల్ పరీక్ష ఆది, సోమవారాల్లో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పాలీసెట్ హాల్ టికెట్ జిరాక్స్‌తో ముందు రోజు తమ పేర్లను స్థానిక ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాలలో నమోదు చేసుకోవాలని, వివరాలకు 9493899544 సంప్రదించాలని సూచించారు.

బైరాన్‌పల్లిలో బడిబాట



ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ధూళిమిట్ట, మే9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో ఉపాధ్యాయులు శుక్రవారం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పిల్లల తల్లితండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని వివరించారు. బైరాన్‌పల్లి పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, 100 శాతం ఫలితాలతో విర్యార్థులు ముందు వరుసలో ఉన్నట్లు తెలిపారు. విద్య, పలు రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మీనాంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మీసేవా కేంద్రాల ద్వారా లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో (గణిత శాస్త్రం)ఒక అంశంగా ఉండి కనీసం అరవై శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులకు రూ. 5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అరుణోదయ 50 వసంతాల సభను విజయవంతం చేయాలి

● రైతుకూలీ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు బోనాల స్వామి

దౌల్తాబాద్, మే9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12న అరుణోదయ 50 వసంతాల సభను విజయవంతం చేయాలని కళాకారులకు కళాభిమానులకు రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బోనాల స్వామి, కార్యదర్శి మహేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బోనాల స్వామి, మహేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అరుణోదయ 50 వసంతాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాలలో అమరులు కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ చొరవతో అరుణోదయ సాంస్కృతిక సమైక్య ఏర్పాటైందన్నారు. అలాగే అరుణోదయ డాక్యుమెంటరీని, విప్లవ ప్రజా సంస్థల 50 ఏళ్ల ప్రస్థానపు పాటను ప్రదర్శించుకుటు జరిగే అరుణోదయ 50 ఏళ్ల పరిపూర్తి ముగింపు సభలను జయప్రదం చేసే విధంగా కళాకారులు, ప్రజా కళాభిమానులు విస్తృతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందాపూర్, ఎల్లం, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీతారామ కల్యాణోత్సవాలు

నంగునూరు, మే 9 (ఆంధ్రజ్యోతి):నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్వహిస్తున్న సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ ఆవరణలో భక్తులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళారతులు, తీర్థ ప్రసాద వితరణ, తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాకారులచే దాండియా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కతుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి దంపతులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ దంపతులు, నాయకులు రవీందర్ రెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాంపు కార్యాలయంలో హనుమాన్ స్వాముల భజన



పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ

సిద్దిపేట కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): నేడు సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హనుమాలదారులతో భజన, పూజా కార్యక్రమం నిర్వహించనున్నారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆధ్వర్యంలో అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో సాయంత్రం 7గంటలకు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు.

ఘనంగా రథం ఊరేగింపు

దుబ్బాక, మే9 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా వైశాఖ శుద్ధ ఏకాదశిన జరిగే దుబ్బాక కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం సుప్రభాతసేవతో మొదలైన ఉత్సవాలు శివపార్వతుల కల్యాణం, బండ్ల బోనాలు ఘనంగా జరిగాయి. రైతులకు పంటనిండి ధాన్యరాశులు ఇంట్లోకి చేరిన తర్వాత వైశాఖశుద్ధ ఏకాదశిని అంగరంగవైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం రథోత్సవాన్ని(స్వామివారి ఊరేగింపు) పట్టణంలోని విధివిధిన తిరిగారు. స్వామివారి రథానికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

వన మహోత్సవానికి 40 వేల మొక్కల్ని సిద్ధం చేయాలి: ఎంపీడీవో



నర్సాయపల్లిలో మొక్కల్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మద్దూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవానికి 40 వేల మొక్కల్ని సిద్ధంగా ఉంచాలని సెక్రటరీలకు సూచించినట్లు ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నర్సాయపల్లి, గాగిల్లాపూర్ గ్రామాల్లోని వన నర్సరీలను సందర్శించి పరిశీలించారు. ఆ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. వర్షా కాలం ఆరంభానికి ముందు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ వేసవిలో మొక్కలకు ఉదయం సాయంత్రం నీళ్ల పట్టించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాను సారంగా మొక్కలు నాటాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరెండెంట్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ స్పందన లెస్

(5వ పేజీ తరువాయి)

ఎల్ఆర్ఎస్ సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈసారైనా 25 శాతం రాయితీని పెద్దఎత్తున వినియోగించుకుంటారో చూడాలి.

నత్తనడకన ప్రొసీడింగ్‌ల పంపిణీ

జిల్లాలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి ప్రొసీడింగ్ పత్రాలను అందించడంలో ఆలస్యమవుతున్నది. జిల్లాలో ఇప్పటివరకు మొత్తంగా 17,868 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా, 10,326 మంది దరఖాస్తుదారులకు మాత్రమే ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. సర్వర్ మొరాయింపుతో పాటు సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి సాంకేతికంగా సమస్యలు రావడమే ప్రొసీడింగ్‌ల పంపిణీలో ఆలస్యమవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు.